సాక్షి రంగారెడ్డి

శనివారం। 18। మే। 2024



'నార్సింగి'లో అవిశ్వాసం

నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస ప్రత్యేక సమావేశాలు శనివారం జరగనున్నాయి. 8లో▸



ప్లాంట్‌ను తొలగించండి

దుర్వాసన వెదజల్లే ఆయిల్ ప్లాంట్‌ను తొలగించాలని కొత్తూరు తండావాసులు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 8లో▸



న్యాయం చేయండి సారూ..

వ్యక్తి మృతికి కారణమైన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సాగర్ రోడ్డుపై బాధితులు ధర్నా చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పరిశీలన



స్ట్రాంగ్‌రూం భద్రతను పరిశీలిస్తున్న లోకేష్‌కుమార్, కలెక్టర్ శశాంక తదితరులు

చేవెళ్ల: చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను వెబ్ క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సీఈఓ లోకేష్‌కుమార్ పరిశీలించారు. మండల పరిధిలోని గొల్లపల్లి సమీపంలో ఉన్న బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూంను శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంకతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూం వద్ద ఏర్పాటు చేసిన భద్రతను పర్యవేక్షించారు. వెబ్‌క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా ఒక్కో నియోజకవర్గం స్ట్రాంగ్ రూం, వాటికి వేసిన సీళ్లను పరిశీలించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి వెంట చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్లు వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మీటర్ సమస్యతోనే అధిక బిల్లు

తేల్చిన విద్యుత్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్: మీటర్ సమస్యతోనే కరెంటు బిల్లు ఎక్కువగా వచ్చిందని విద్యుత్ అధికారులు తేల్చారు. మండలంలోని ముర్తూజగూడలో 'రేకుల ఇంటికి రూ.11,929 బిల్లు' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. మండల విద్యుత్ ఏఈ హమునాయక్ ముర్తూజగూడలోని సత్తమ్మ ఇంటిని సందర్శించారు. బిల్లు ఎందుకు ఎక్కువగా వచ్చిందని ఇంట్లో కరెంటుతో వాడే వస్తువులను, విద్యుత్ మీటర్‌ను పరిశీలించారు. మీటర్ సమస్యతోనే బిల్లు ఎక్కువగా వచ్చిందని గుర్తించారు. ఎక్కువగా వచ్చిన బిల్లును సరిచేశారు. దీంతో రూ.271 బిల్లు వచ్చింది. కొత్త మీటర్‌ను సైతం బిగించారు.

పౌల్ట్రీ రైతులకు ఆస్తిపన్ను మినహాయించండి



షాద్‌నగర్: పౌల్ట్రీ రైతులకు ప్రభుత్వం విధించిన ఆస్తిపన్నును మినహాయించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పాత బకాయిల వసూలు కోసం మున్సిపల్ పరిధిలో ఉండే పౌల్ట్రీ రైతులకు జారీ చేసిన ఆదేశాలను రద్దు చేయాలని కోరారు. పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

చంచల్‌గూడ జైలుకు మల్కాజిగిరి కార్పొరేటర్

సాక్షి,సిటీబ్యూరో: బహదూర్‌పురాలోని ఓ పోలింగ్ బూత్‌లో రిగ్గింగ్‌కు పాల్పడ్డారని సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వీడియోను వైరల్ చేసిన కేసులో అరెస్టయిన మల్కాజిగిరి బీజేపీ కార్పొరేటర్ విరుపల్లి శ్రవణ్‌తో పాటు నాంపల్లికి చెందిన మహ్మద్‌బీన్ అలీ అల్ గుత్మీ, చాదర్‌ఘాట్‌కు చెందిన పిద్దముళ్ల కాశీ, చిక్కడపల్లికి చెందిన కనుకటి మిథిలేష్‌లకు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో వీరిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్లు కె.మధులత, మట్టం రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బహదూర్‌పురాలోని ఓ పోలింగ్ బూత్‌లో రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారంటూ నిందితులు ఎక్స్, ఫేస్‌బుక్ వంటి పలు సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వీడియోను పోస్ట్ చేశారు. 2022లో పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో జరిగిన పాత వీడియోను.. పాతబస్తీలో రిగ్గింగ్ జరుగుతుందంటూ ఎలాంటి ధ్రువీకరణ లేకుండా అవాస్తవ సమాచారంతో సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ వ్యవహారంపై ఐటీ చట్టం కింద నలుగురు నిందితులపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. విచారణ చేపట్టి పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శ్రవణ్ బెయిల్ పిటీషన్‌ను నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి శనివారానికి వాయిదా వేశారు. కార్పొరేటర్ శ్రవణ్ అరెస్టును మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఖండించారు.



సినిమా.. లేదు మామా!

వారంపాటు.. బొమ్మ బంద్

- బోసిపోతున్న సినిమా థియేటర్లు
- పెద్ద సినిమాలు లేకపోవడమే కారణం
- సార్వత్రిక ఎన్నికలు, ఐపీఎల్ మ్యాచ్‌లతో ప్రభావం
- నష్టాలు భరించలేమంటున్న యజమానులు
- ఈ నెల 23 వరకు మూసివేతకు నిర్ణయం


షాద్‌నగర్: గోడలపై ఆకర్షించే పోస్టర్లు.. భారీ కటౌట్లు.. వారం ఎప్పుడవుతుందా.. కొత్త సినిమా ఎప్పుడు విడుదలవుతుందా అని ఎదురు చూపులు.. ఉదయం పదిగంటలు అయ్యిందంటే చాలు టికెట్లు ఎక్కడ అయిపోతాయోనని థియేటర్లకు ప్రేక్షకుల క్యూ.. అభిమానుల సందడితో థియేటర్లు కళకళలాడేవి. అలాంటి థియేటర్లు ప్రస్తుతం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. పెద్ద సినిమాల విడుదల లేకపోవడం.. చిన్న చిత్రాలకు అంతగా ఆదరణ లేకపోవడంతో వెలవెలబోతున్నాయి. దీంతో సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాల సంఘం వారం రోజుల పాటు వినోదానికి విరామం ప్రకటించింది.

నిర్వహణ భరించలేక..

జిల్లాలో సుమారు 80 వరకు సినిమా థియేటర్లు ఉన్నాయి. రోజుకు ఒక్కో థియేటర్ ఆదాయం సుమారు రూ.10వేల నుంచి రూ. 20వేల వరకు ఉంటుంది. పెద్ద హీరోల సినిమాలు విడుదలైతే అది మరింత పెరుగుతుంది. కొన్ని రోజులుగా ప్రేక్షకులు సరిగా రాకపోవడంతో ఒక్కో థియేటర్ లక్షల్లో ఆదాయం కోల్పోతోంది. దీంతో థియేటర్ల యాజమానులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి థియేటర్‌లో మేనేజర్ పాటు ఆపరేటర్, రివైండర్, బుకింగ్ కౌంటర్లో టికెట్లు ఇచ్చే వారు, గేట్ కీపర్లు, స్వీపర్లు, స్కావెంజర్, వాచ్‌మన్లు, పార్కింగ్‌లో సిబ్బంది, తినుబండారాలు అమ్మే సిబ్బందితో కలిపి సుమారు 20 మంది వరకు పని చేస్తుంటారు. ఈ లెక్కన జిల్లాలో ఉన్న థియేటర్లలో సుమారు 1,600 మంది కార్మికులు పని చేస్తున్నారు. కొన్ని రోజులుగా థియేటర్లు సరిగా నడవకపోవడంతో ఖర్చుకు తగిన విధంగా రాబడి ఉండటం లేదు. దీంతో సిబ్బందికి జీతాలు, విద్యుత్ బిల్లులు చెల్లించలేక, థియేటర్ నిర్వహణ భరించలేక యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

గిట్టుబాటు లేక

ఒక్కో షోకు 15 మంది కూడా రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో స్వచ్ఛందంగా సినిమా ప్రదర్శనలను నిలిపివేసినట్లు థియేటర్ల యజమానులు చెబుతున్నారు. కొన్ని రోజులుగా పెద్ద హీరోల సినిమాలు లేకపోవడంతో ప్రేక్షకులు థియేటర్లకు రావడమే మానేశారు. ఇంటర్‌నెట్, స్మార్ట్ ఫోన్లు, ఇంట్లో పెద్ద టీవీలు, ఓటీటీ వేదికలు రావడంతో చాలా మంది ఇంట్లోనే సినిమాలు చూస్తున్నారు. దీనికి తోడు ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ పోటీల కారణంగా సాయంత్రం, రాత్రి షోలకు అసలే ప్రేక్షకులు రావడం లేదని థియేటర్ల యజమానులు వాపోతున్నారు. ఐపీఎల్ ముగిశాక.. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



వారం పాటు థియేటర్లు బంద్

వేసవి సెలవులు వచ్చాయంటే చాలు థియేటర్లు కిటకిటలాడేవి. టికెట్ల కోసం గంట ముందే లైన్లలో నిలబడి వేచి చూసేవారు. అయినా టికెట్లు దొరుకుతాయనే నమ్మకం ఉండేది కాదు. పెద్ద హీరోల సినిమాలైతే బ్లాక్‌లో ఎంతైనా కొని చూసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. పెద్ద హీరోల సినిమాలు విడుదల కాకపోవడం, సార్వత్రిక ఎన్నికలు, ఐపీఎల్ క్రికెట్ తదితర కారణాలతో థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య కొంత కాలంగా గణనీయంగా తగ్గింది. ఎక్కడ చూసినా థియేటర్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఫలితంగా సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్య సంఘం ఈనెల 23 వరకు షోలు నిలిపివేయాలని నిర్ణయించింది.

ఖర్చుకు తగిన రాబడి లేదు



పెద్ద హీరోల సినిమాలు విడుదల కాకపోవడంతో ఇటీవల థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య బాగా తగ్గింది. ఖర్చుకు తగిన రాబడి లేదు. దీంతో సంఘం వారు వారం రోజుల పాటు షోలు నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నారు.

– గంగాధర్, థియేటర్ యజమాని, షాద్‌నగర్

ఆ ఆనందమే వేరు



కొత్త సినిమా విడుదలైనప్పుడు థియేటర్‌కు వెళ్లి చూస్తాం. థియేటర్‌లో సినిమా చూస్తే ఆ ఆనందమే వేరుగా ఉంటుంది. వినోదాన్ని అందించే థియేటర్లలో ప్రదర్శనలు తాత్కాలికంగా నిలిపివేయడం కొంత బాధాకరమే.

– అశ్రఫ్, షాద్‌నగర్

ఇంట్లో నుంచే ఓటీటీలో..



ప్రస్తుతం అంతా ఇంటర్‌నెట్ కాలం నడుస్తోంది. సినిమాలన్నీ ఓటీటీలో వస్తున్నాయి. దీంతో థియేటర్లకు వెళ్లడం చాలా వరకు తగ్గింది. పెద్ద హీరోల సినిమాలు తప్ప ఇంట్లో కూర్చునే అన్ని సినిమాలు చూస్తున్నాం.

– శ్రీకాంత్, షాద్‌నగర్

అంగన్‌వాడీల రిటైర్మెంట్ @ 65

- వివరాలు సేకరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది
- ఆయాల వయస్సు నిర్ధారణలో జాప్యం
- వచ్చే నెల చివరిలోగా తేలనున్న లెక్క
- ఉద్యోగ విరమణతో పెరగనున్న ఖాళీల సంఖ్య



షాద్‌నగర్ ప్రాజెక్టు కార్యాలయం

కేశంపేట: ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఐసీడీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్ వయస్సును 65 ఏళ్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఐసీడీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాల్లో ఏప్రిల్ 30 వరకు 65 ఏళ్లు పైబడిన వారిని గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గత నెలలోనే వీరు ఉద్యోగ విమరణ చేయాల్సి ఉండగా ఎన్నికల కోడ్ ఉండడంతో పొడిగించారు. వచ్చే నెల చివరిలోగా అర్హులైన వారు ఉద్యోగ విరమణ చేసే అవకాశం ఉంది. కొన్ని గ్రామాల్లో వయస్సు పైబడిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులు విధుల్లో కొనసాగారు. కొంతమంది వివిధ కారణాలతో స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో ఇప్పటికే ఉన్న ఖాళీలతో పాటు మరిన్ని ఖాళీలు పెరిగే అవకాశం ఉంది.

వివరాల సేకరణలో అధికారులు..

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల్లో ఏప్రిల్ 30లోగా 65 ఏళ్లు పైబడిన వారిని ఐసీడీఎస్ అధికారులు గుర్తించే పనిలో పడ్డారు. రిటైర్మెంట్ చేసే అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. గతంలో అంగన్‌వాడీ టీచర్లకు రూ.60వేలు, ఆయాలకు రూ.30 వేలు ఇస్తామని చెప్పడంతో వీరు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు అందించేందుకు కసరత్తు చేస్తోంది. రూ.5లక్షలు అందించాలని అంగన్‌వాడీ టీచర్లు, రూ.3 లక్షలు చెల్లించాలని ఆయాలు డిమాండ్ చేస్తున్నారు.

గందరగోళం..

ఐసీడీఎస్ అధికారుల వద్ద ఎంప్లాయ్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఈఎంఎస్)లో ఉన్న వివరాలకు ఆయాల వద్ద ఉన్న వివరాలకు పొంతన లేకుండాపోయింది. అంగన్‌వాడీ టీచర్లకు పదో తరగతి సర్టిఫికెట్లు ఉండగా ఆయాలు చదువుకోకపోవడంతో వారి వయస్సు నిర్ధారణ కోసం అధికారులు ఆధార్ కార్డులు సేకరిస్తున్నారు. అందులో కూడా చాలా మంది వయస్సు హెచ్చుతగ్గులు ఉండడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో సివిల్ సర్జన్ వద్ద నుంచి వయస్సు నిర్ధారణ పత్రాలు తేవాలని చెబుతున్నారు.

భారీగా ఖాళీలు

ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసింది. మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు గతంలో ఆయాలు ఉండేవారు కాదు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న టీచర్లే ఆయా పనులు చేసుకునే వారు. మినీ కేంద్రాలు అంగన్‌వాడీ కేంద్రాలుగా మారడంతో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరితో పాటు టీచర్ పోస్టులు.. వీటికి అదనంగా ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేసే సంఖ్య ఉండనుంది.

వివరాలు సేకరిస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్, ఆయాలను గుర్తిస్తున్నాం. అంగన్‌వాడీ టీచర్‌కు వారు చదివిన సర్టిఫికెట్లను పరిశీలించి వయస్సును నిర్ధారిస్తున్నాం. ఆయాలను గుర్తించడంలో కొంత జాప్యం జరుగుతోంది. అనుమానాలున్న వారిని ప్రభుత్వ వైద్యుడి చేత వయస్సు ధ్రువీకరణ పత్రం తేవాలని కోరాం. త్వరలోనే అర్హులైన వారి జాబితా ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– నాగమణి, ఐసీడీఎస్ సీడీపీఓ, షాద్‌నగర్

ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: ఆస్పత్రులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సమావేశంలో చైర్మన్ హోదాలో అనుదీప్ దురిశెట్టి మాట్లాడారు. జిల్లాలోని అన్ని రకాల ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలు తమ పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోకుడదన్నారు. వారు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఇంజక్షన్లు, సెలైన్లు పెట్టరాదని అల్లోపతి వైద్యం చేయరాదన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కదిరివన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్, డీసీపీ మనోహర్, ఐఎంఏ సిటీ బ్రాంచ్ సెక్రటరీ డాక్టర్ మినహాజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నీరజ

ఆయిల్‌పామ్ సాగుకు ప్రత్యేక రాయితీలు

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నీరజ

షాద్‌నగర్: ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రత్యే రాయితీలను అందిస్తోందని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి నీరజ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్లలో శుక్రవారం ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ.. వ్యవసాయంలో రైతులు నూతన పద్ధతులు పాటించాలని సూచించారు. సాగుకు ప్రభుత్వం మొక్కలపై, డ్రిప్ ఇరిగేషన్, పంట నిర్వహణకు రాయితీలు అందిస్తోందని చెప్పారు. రాయితీలను రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పంట సాగు చేసిన తర్వాత మూడేళ్లకు దిగుబడి ప్రారంభం అవుతుందని, 30 ఏళ్ల పాటు నిరవధికంగా దిగుబడి వస్తుందని ఆమె వివరించారు. రాష్ట్ర పామ్ ఆయిల్ సలహాదారు డాక్టర్ బీఎస్ రావు మాట్లాడుతూ.. పామాయిల్ ప్రధానంగా ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుందని, పంటకు చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని తెలిపారు. ఎకరానికి 8 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని, దీంతో నికరంగా రైతుకు రూ.లక్ష ఆదాయం వస్తుందని చెప్పారు. పామాయిల్‌లో మూడేళ్ల పాటు కూరగాయలు, మొక్కజొన్న, కంది, అరటి, బొప్పాయి వంటి పంటలను అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చని ఆయన వివరించారు. కార్యక్రమంలో వాల్యూ ఆయిల్ గ్యాస్ సర్వీసెస్ పరిశ్రమ ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ఏడీఏ రాజారత్నం, ఏఈఓ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం: అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని ఎన్నికలకు ముందు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జిల్లాలో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా 16 మాత్రమే ఏర్పాటు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. నేరుగా రైస్‌మిల్లులకే వరి ధాన్యం తీసుకెళ్లాలని అధికారులు చెబుతుండం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తరుగు పేరుతో నాలుగైదు కిలోలను తక్కువ తూకం చేస్తున్నారని, క్వింటాలుకు రూ.1,700 మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు 6.28 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని.. సగానికి పైగా ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉందన్నారు. పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో అకాల వర్షాలకు తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని గత ప్రభుత్వం అమలు పరచలేదని ప్రస్తుత ప్రభుత్వం కూడా అమలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. శనివారం నుంచి బీజేపీ, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించి ఇప్పటి వరకు ఎందుకు రద్దు చేయలేదని నిలదీశారు. ధరణిని రద్దు చేస్తామని, సమగ్ర విచారణ చేపడతామని చెప్పి దీనిపై ఎందుకు ముందుకెళ్లడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపాయ్యగౌడ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొరెడ్డి నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బూడిద నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వర్సిటీ వీసీ ఎల్ఎస్ గణేశన్ తదితరులు

ఆ ప్రచారంలో వాస్తవం లేదు

- వేడినీళ్లు పడి విద్యార్థినికి గాయాలు
- ఇక్ఫాయ్ వర్సిటీ వీసీ గణేశన్ వెల్లడి

చేవెళ్ల: శంకర్‌పల్లి మండలం దొంతన్‌పల్లి సమీపంలోని ఇక్ఫాయ్ కళాశాల హాస్టల్‌లో ఉంటున్న ఎల్ఎల్‌బీ ఫైనలియర్ విద్యార్థిని లేఖ్యవర్ధిని వేడినీళ్లు పడి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆమె నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. యాసిడ్ దాడి జరిగిందని సోషల్ మీడియాలో వస్తున్న వార్తల నేపథ్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎల్ఎస్ గణేశన్, రిటైర్డ్ కల్నల్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ విశ్వనాథ్, ప్రొఫెసర్‌లు అక్బర్, చిత్ర తదితరులు మాట్లాడారు. తమ కళాశాలలో లా ఫైనలియర్ చదువుతున్న లేఖ్యవర్ధిని ఈనెల 15న రాత్రి స్నానం చేసేందుకు వెళ్లి వేడినీళ్లు ఉన్న బకెట్‌ను గమనించకుండా ఒక్కసారిగా ఆనీటిని పైన పోసుకోవటంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. విద్యార్థినికి 40 శాతం కాలిన గాయాలు అయ్యాయని.. ప్రస్తుతం ఆరోగ్యపరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు చెప్పారని తెలిపారు. విద్యార్థిని బాగోగులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ మెరుగైన వైద్యం అందించేలా చూస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి యాసిడ్‌దాడి జరగలేదని.. యాసిడ్ దాడి జరిగినట్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారన్నారు. ఇప్పటికే పోలీసులు విద్యార్థిని ఉండే హాస్టల్ గదిలో క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరించారని తెలిపారు. బాత్‌రూమ్‌లు శుభ్రపరిచే వస్తువుల గది తాళాలు సైతం తమ సిబ్బంది వద్దే ఉంటాయని, బాత్‌రూమ్‌లను శుభ్రపరిచే లిక్విడ్ స్నానం చేసే నీటిలో కలిసే అవకాశం కూడా లేదని స్పష్టం చేశారు.

ప్లాంట్‌ను తొలగించండి


దుర్వాసన వెదజల్లుతున్న ఆయిల్ ప్లాంట్

కొత్తూరు: నిత్యం దుర్వాసన వెదజల్లే ఆయిల్ ప్లాంట్‌ను తమ ఇళ్ల సమీపం నుంచి తొలగించాలని కొత్తూరు తండావాసులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాకు సమీపంలో సర్వే నంబర్లు 52, 72లోని కొంత భూమిలో గతేడాది తారురోడ్డు వేయడంలో ఉపయోగించే ఓ ఆయిల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆ ప్లాంట్ నుంచి నిత్యం విపరీతమైన దుర్వాసన వెలువడుతుందన్నారు. ఆ దుర్వాసన పీల్చుకోవడంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నట్లు తెలిపారు. అలాగే, సమీప పొలాలు కలుషితం అయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ప్లాంట్‌ను తొలగించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపట్టతామని హెచ్చరించారు. ఈ విషయమై కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీను వివరణ కోరగా ఆయిల్ ప్లాంట్ ఏర్పాటు కోసం మున్సిపాలిటీ, ఇతర శాఖల నుంచి నిర్వాహకులు ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తండావాసులు అంజనేయులు నాయక్, బాలునాయక్, రమేశ్, సోంమ్లు, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కొత్తూరు: కొత్తూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నేడు (శనివారం) ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అరుంధతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, ఆయాశాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన నేడు

కొందుర్గు: మండలంలోని తంగెళ్లపల్లిలో శనివారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫీల్డ్ ఆఫీసర్ మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు జిల్లా మేనేజర్ ప్రమోద్‌కుమార్ హాజరవుతారని, ఆసక్తి గల రైతులు ఈ సదస్సుకు హాజరై ఏమైనా సందేహాలు ఉంటే తెలుసుకోవాలని సూచించారు.

నేడే 'నార్సింగి'లో అవిశ్వాసం

- గోవా క్యాంప్ నుంచి వచ్చిన కౌన్సిలర్లు
- 10.30 గంటలకు చైర్‌పర్సన్‌పై 12.30కి వైస్ చైర్మన్‌పై సమావేశాలు
- పోలీసు బందోబస్తు ఏర్పాటు


నార్సింగి మున్సిపల్ కార్యాలయం

మణికొండ: నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస ప్రత్యేక సమావేశాలు ఈ నెల 18న (నేడు) జరగనున్నాయి. రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ డి. రేఖాయాదగిరి అవిశ్వాసంపై సమావేశం నిర్వహిస్తారు. ఫలితం తర్వాత తిరిగి వైస్ చైర్మన్ జి. వెంకటేశ్‌యాదవ్ అవిశ్వాసంపై మధ్యాహ్నం 12.30 గంటలకు మరో మీటింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కౌన్సిల్ సమావేశం మందిరంలోకి కౌన్సిలర్లకు మాత్రమే అనుమతించనున్నారు. అవిశ్వాస ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

గోవా నుంచి వచ్చిన కౌన్సిలర్లు

నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో అవిశ్వాసం లేఖలపై సంతకాలు చేసిన 12 మంది కౌన్సిలర్లను గోవాలోని క్యాంప్‌లో ఉంచారు. అయితే సోమవారం గోవా ఎయిర్‌పోర్టు నుంచి సిటీకి వెళ్తుండగా కౌన్సిలర్లు ప్రయాణిస్తున్న వాహనానికి రోడ్డు ప్రమాదం జరగడంతో కొందరు గాయపడినట్లు సమాచారం. దాంతో వారు శనివారం ఉదయం నేరుగా సమావేశానికి రావాల్సి ఉండగా గురువారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశం మేరకు అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలోనే హైదరాబాద్‌లో క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. అందులోనే వారు ఉన్నట్టు తెలిసింది.

అవిశ్వాసం లాంఛనమే..

నార్సింగి మున్సిపాలిటీలో మొత్తం 18 మంది సభ్యులు ఉండగా అవిశ్వాసాలు నెగ్గేందుకు అవసరమైన మూడింట రెండో వంతు కౌన్సిలర్లు సంతకాలు చేశారు. వారంతా నేరుగా సమావేశానికి రానున్నారు. అవిశ్వాసం పెట్టిన వారిని మచ్చిక చేసుకునేందుకు బీఆర్ఎస్ నుంచి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వైపు నుంచి ఎలాంటి ప్రయత్నాలు లేకపోవడంతో అవిశ్వాసం నెగ్గే సూచనలే కనిపిస్తున్నాయి. అయితే జాతీయ స్థాయిలో బద్ధ శత్రువులైన కాంగ్రెస్ ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి ఇద్దరు బీజేపీ సభ్యులు మద్దతు ఇవ్వడం సర్వత్రా చర్చానీయాంశంగా మారింది. అవిశ్వాసాన్ని ఎదుర్కొంటున్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌తో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

షాబాద్: చందనవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు (శనివారం)2 గంటలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు షాబాద్ విద్యుత్ ఏఈ నరేందర్‌నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉ.7 గంటల నుంచి ఉ. 9 గంటల వరకు చందనవెల్లి, పెద్ద సోలీపేట్, చిన్నసోలీపేట్, మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ, లింగారెడ్డిగూడ, గ్రామాల్లో, పరిశ్రమల్లో సబ్‌సేషన్‌లో సాంకేతిక లోపం కారణంగా చిన్న చిన్న మరమ్మతులు చేసేందుకు పవర్ కట్ చేస్తున్నట్లు తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

రంగాపూర్ చెరువును సందర్శించిన ఇరిగేషన్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నందిగామ: మండల పరిధిలోని రంగాపూర్ గ్రామ శివారులోని ఓ చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే విషయమై శుక్రవారం సాక్షి దినపత్రికలో ‘మట్టి దందా’ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. శుక్రవారం ఇరిగేషన్ ఏఈ రవీందర్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ చెరువును సందర్శించారు. అనంతరం ఏఈ మాట్లాడుతూ.. చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తవ్వి తీసుకెళ్లినట్లు తేలిందని.. ఎవరు తీసుకెళ్లారనే విషయంపై పూర్తి విచారణ చేపడతమాన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. అనుమతులు లేకుండా చెరువులు, కుంటల్లో నుంచి ఎట్టి పరిస్థితుల్లో మట్టిని తరలించవద్దని, ఒక వేళ తరలించినట్లయితే చట్ట పరమైన చర్యలు ఎదుర్కోవల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న దయాకర్‌రెడ్డి దంపతులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి పట్టణంలోని దేవీగ్రాండ్ హోటల్ యజమాని దయాకర్‌రెడ్డి, శోభ దంపతులు శుక్రవారం రూ.51వేల విరాళం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు అందజేశారు. కార్యక్రమంలో ఒగ్గుకిషోర్, కుమార్, భూపాల్, రాయల శంకర్, వేణు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధి

ఎమ్మెల్యే శంకర్


మురుగుకాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి నాయకులు పార్టీలకతీతంగా కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడలో మురుగు కాలువను ఎమ్మెల్యే నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ నాయకులు గ్రామాల అభివృద్ధిని విస్మరించారని అన్నారు. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకున్నారే తప్పా సమస్యలు పరిష్కారించింది లేదని విమర్శించారు. కనీసం మురుగు కాలువలను కూడా శుభ్రం చేసి పాపాన పోలేదని మండిపడ్డారు. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. గ్రామంలో మురుగు కాలువ నిర్మాణానికి కావాల్సిన నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు తిరుపతిరెడ్డి, అశోక్, కృష్ణారెడ్డి, మల్లేష్ యాదవ్, సురేష్‌గౌడ్, పకీర్‌పాషు, రమేశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, గణేష్‌యాదవ్, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రాల రిజిస్ట్రేషన్ కేసులో..

తొమ్మిది మంది నిందితుల అరెస్టు

కొందుర్గు: నకిలీ ధ్రువపత్రాలతో భూమి రిజిస్ట్రేషన్ చేసిన కేసుకు సంబంధించి పోలీసులు మరో అడుగు ముందుకేశారు. వివరాలు.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేటకి చెందిన గడ్డం వెంకటయ్యకు సంబంధించిన 30 గుంటల భూమిని అతడు బతికుండగానే మరణించినట్లు తప్పుడు పత్రాలు జతచేసి గాయత్రి, మమత పేరున పట్టా మార్పిడి చేసిన సంగతి పాఠకులకు విధితమే. అయితే ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న వారిద్దరిని ఇదివరకే పోలీసులు అరెస్టు చేయగా తాజాగా శుక్రవారం మరో 9 మందిపై కేసు నమోదు చేశారు. స్థానికంగా ఉండే మీసేవా కేంద్రం నిర్వహకుడు జంగయ్యను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సక్రమ్ తెలిపారు. అయితే ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన ఓ ఉన్నతాధికారిని అరెస్టు చేయకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

బావిలో గల్లంతైన వ్యక్తి

మృతదేహం లభ్యం

మాడ్గుల: బావిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మాడ్గుల మండలం నర్సాయిపల్లికి చెందిన బైకని కొమరయ్య(40) గురువారం మధ్యాహ్నం కొల్కులపల్లి గ్రామంలోని ఓ బావిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. మొదటి రోజు ఆచూకీ లభించలేదు.. రెండో రోజు గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

కారు బోల్తా

- పరారైన డ్రైవర్
- డిక్కీలో నల్లబెల్లం, పటిక
- ఆమనగల్లు మండలం రాంనుంతల సమీపంలో ప్రమాదం


బోల్తాపడిన కారు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గేటు సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఓ కారు బోల్తాపడింది. కారులో నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటిక లభ్యమైనట్లు ఆమనగల్లు ఎస్ఐ బల్‌రాం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. ఆమనగల్లు మండలం రాంనుంతల గేటు సమీపంలో గురువారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇది గమనించిన హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న ఓ కారు డ్రైవర్ కారును అతివేగంగా నడపడంతో అదుపు తప్పి కొద్దిదూరంలో బోల్తాపడింది. కారు డ్రైవర్ కారును అక్కడే వదిలి పరారయ్యాడు. పోలీసులు కారును చెక్ చేయగా డిక్కీలో నాటుసారా తయారీకి ఉపయోగించే 16 సంచుల నల్లబెల్లం, 4 సంచుల పటిక ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన



కొత్తూరు: మండలంలోని సిద్ధాపూర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం గ్రామస్తులు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలు స్వామివారి పల్లకీ సేవా, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం నవీన్‌చారి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి సారూ..

- సిమెంట్ లారీ ఢీకొనడంతో వ్యక్తి దుర్మరణం
- ఠాణా ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా
- సీఐ జోక్యంతో సద్దుమణిగిన సమస్య


పీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

యాచారం: ఓ వ్యక్తి మృతికి కారణమైన ఓ ప్రైవేట్ కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు శుక్రవారం యాచారం పోలీస్ స్టేషన్, సాగర్‌రోడ్డుపై బాధితులు ధర్నా చేశారు. వివరాలు.. మాల్ మార్కెట్‌లో గురువారం ఉదయం ఓ సిమెంట్ లారీ ఢీకొని నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కుదబక్షాపల్లికి చెందిన అంతయ్య తీవ్ర గాయాలై మృతి చెందాడు. ప్రమాదం జరిగిన మరుసటి రోజువరకు కంపెనీ ప్రతినిధులు ఎవరూ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి రాలేదు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన అంతయ్య కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం మధ్యాహ్నం యాచారం పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న సాగర్ రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. దళిత కుటుంబానికి చెందిన అంతయ్య కష్టజీవి అని.. అతడి మృతికి కారణమైన సిమెంట్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వారు రోడ్డుపై బైఠాయించడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సీఐ శంకర్ కుమార్ వారికి నచ్చజెప్పి సిమెంట్ కంపెనీపై చర్యలు తీసుకోవడంతో పాటు న్యాయం చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం కుటుంబ సభ్యులు అంతయ్య పోస్టుమార్టానికి ఒప్పుకొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కేశంపేట: రికార్డులను తారుమారు చేసి ప్రభుత్వ భూమిని పట్టాభూమిగా మార్చుకోని అమ్మకానికి పెట్టిన రికార్డులను పరిశీలించి, పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరుతూ శుక్రవారం దత్తాయపల్లికి చెందిన పలువురు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని దత్తాయపల్లి రెవెన్యూ శివారులోని సర్వేనంబర్ 27లో 3ఎకరాల 16గుంటల భూమి ఖాస్రా, చేసాలాతో పాటు పలు రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదైనట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ భూమిని పట్టాభూమిగా మార్చుకోని అమ్మకానికి పెట్టారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఇంటర్నేషనల్ పాఠశాల సీఈఓ యశస్వి


విద్యార్థులకు మొక్కలు, గోల్డ్ మెడల్స్ అందజేస్తున్న యాజమాన్యం

మొయినాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాల సీఈఓ మల్కా యశస్వి, ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ జోహెర్‌లు అన్నారు. మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గల పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో పచ్చదనం, పరిశుభ్రత అనే కార్యక్రమంతో పాటు విద్యార్థులకు మొక్కలు, గోల్డ్ మెడల్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదవ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులందరికి మొక్కలు పంపిణీ చేసి ప్రతి ఒక్కరూ విధిగా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నూయా, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ అనూప్ శర్మ


సాత్విక్‌రెడ్డి

షాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ అనూప్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆరవ జాతీయ స్కేటింగ్ ఛాంపియన్ పోటీలకు సాత్విక్‌రెడ్డి ఎంపిక కావడంతో కోచ్ కె. మొంగ్యనాయక్, పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి కుమారుడు గుర్రాల సాత్విక్‌రెడ్డి బండ్లగూడలోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. పాఠశాల తరపున 9 నుంచి 11 సంవత్సరాల కేటగిరీలో ఆరవ జాతీయ స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ప్రతిభను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇచ్చి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. సహకరిస్తున్న తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కోచ్ మొంగ్యనాయక్ మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయం వరిస్తుందన్నారు.

స్కేటింగ్ పోటీలకు విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: గోవాలో నిర్వహిస్తున్న ఆరవ జాతీయ స్కేటింగ్ పోటీలకు ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామశివారులోని ఇండియన్ హైట్స్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. 5వ తరగతి చదువుతున్న దుర్గావరప్రసాద్(10), 8వ తరగతి చదువుతున్న నాగలింగేశ్వరస్వామి(13)విద్యార్థులు, ఈ నెల 16 నుంచి 19 వరకు జరుగుతున్న ఈ పోటీల్లో ప్రతిభను చాటనున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విశ్వేశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదలతో శ్రమిస్తే విజయతీరాలకు చేరుకుంటారని అన్నారు. విద్యార్థులలో ఆసక్తిని గుర్తించి వారికి స్కేటింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఇండియన్ హైట్స్ పాఠశాల చైర్మన్ భువనేశ్వర్, స్కేటింగ్ కోచ్ భాస్కర్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.